# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- ■ ములుగు జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతి
- ■ బీఆర్ఎస్‌లో 100 మంది చేరిక



పార్టీలో చేరిన వారితో కలిసి నినాదాలు చేస్తున్న నాగజ్యోతి, నాయకులు

తాడ్వాయి, అక్టోబర్ 7 : బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ములుగు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మండలకేంద్రంలోని ఫెరిడో రెస్టారెంట్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నర్సింగాపురం, ఇందిరానగర్, ఎస్టీ కాలనీలకు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్, బీజేపి కార్యకర్తలు గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారి సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు రజినీకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి నాగజ్యోతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరుతో విసిగిపోయిన కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎమ్మెల్యేకు పబ్లిసిటీ తప్ప అభివృద్ధి మీద ధ్యాసలేదని ఆరోపించారు. తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం క ల్పించాలని, అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని, వాటిని నమ్మొద్దని అన్నారు. తాను ఉద్యమవీరుల బిడ్డనని, తన తల్లిదండ్రులలాగే తాను కూడా ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని నాగజ్యోతి కోరారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీసుధీర్‌యాదవ్**



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ములుగురూరల్, అక్టోబర్ 7 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నదని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీసుధీర్‌యాదవ్ అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రగతి కాలనీలో రూ. 6 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పల్లె ప్రగతిలో భాగంగా అన్ని గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా మారాయని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో మట్టిరోడ్లుగా ఉన్న గ్రామాలు, పల్లెలు, కాలనీలు నేడు సీసీ రోడ్లుగా మారి సుందరంగా మారాయని అన్నారు. ములుగు పట్టణంలో మిగిలిన పనులను త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట బుల్లెట్టు ఓదెలు, గడ్డమీది భాస్కర్, కొత్తకొండ రవి, సుభాష్, కాలనీ వాసులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుమార్

## రావణ వధ ఉత్సవ కమిటీ ఎన్నిక

ములుగు రూరల్, అక్టోబర్ 7 : విజయదశమి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే రావణవధ ఉత్సవ కమిటీని శనివార జిల్లా కేంద్రంలోని బొడ్రాయి వద్ద ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండ్రకోట కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాణాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రాసమల్ల శివాజీ, ఓడ రాజు, గాదం దేవేందర్, గాగె రాజు, గుండెబోయిన రమేశ్, ఇమ్మడి రాకేశ్, మాదిరి జనార్దన్, కార్యదర్శిగా శీలమంతుల నరసింహాచారి, సహాయ కార్యదర్శులుగా జక్కుల రేవంత్, యాంచ నాగరాజు, బైకాని రాజశేఖర్, భూమ నరేశ్, గాజ అజయ్, అచ్చునూరి కిషన్, కార్యక్రమ కన్వీనర్‌గా నగరపు రమేశ్, కోకన్వీనర్‌గా దొంతిరెడ్డి రాకేశ్ రెడ్డి, ఇన్‌చార్జిగా కొత్త సురేందర్, కోశాధికారులుగా చెలిమల్ల రాజేందర్, సానికొమ్ము శ్రీనాథ్‌రెడ్డి, సహ కోశాధికారిగా పాడియా చంటి, పబ్లిసిటీ ఇన్‌చార్జిగా నూనె శ్రీనాథ్, బొమ్మగాని ప్రభాకర్, మీడియా ఇన్‌చార్జ్‌లుగా ముకులోత్ శరత్, కుంచం రమేశ్, సభ్యులుగా మొడుగుల మ మన్, కనుకుల అవినాథ్, శంకర్, పవన్‌లాల్, చందు, రమేశ్, రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ రావణ వధకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింభించేలా నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని తెలిపారు.

## మేడారం జాతరను విజయవంతం చేయాలి



ఎస్పీకి జ్ఞాపికను ఇస్తున్న యూత్ ఫౌండేషన్ సభ్యులు

ములుగు, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఫిబ్రవరిలో నిర్వహించనున్న మేడారం మహా జాతర విజయవంతానికి పోలీస్ శాఖతో కలిసి పనిచేయాలని జిల్లా ఎస్పీ గౌష్‌ఆలం సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం అభ్యుదయ యూత్ ఫౌండేషన్ సభ్యులను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు జాతరకు తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ బలగాలకు స్థానిక యువత సహకారం ముఖ్యమన్నారు. అమ్మవార్లను గద్దెలపైకి తీసుకువచ్చే సమయంలో మేడారం పూజారుల సంఘం పెద్దలు, యువత పాత్ర కీలకమని తెలిపారు. పోలీస్ శాఖతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని, జాతర విజయవంతానికి కృషిచేస్తామని యూత్ సభ్యులు హామీ ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీకి వారు జ్ఞాపికను అందించారు. సమావేశంలో డీఎస్పీ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై కిరణ్, పస్రా ఎస్సై శంకర్, తాడ్వాయి ఎస్సై ఓంకార్, యూత్ ప్రెసిడెంట్ బోజరావు అనిల్, రమేశ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ధర్మవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

## ఇద్దరు గుడుంబా విక్రేతల బైండోవర్

వాజేడు, అక్టోబర్ 7 : గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేరూరు ఎస్సై జీ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం మండలంలోని ధర్మవరం గ్రామంలో సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి అనుమానిత ఇళ్లల్లో సోదాలు చేశారు. ఇందులో గ్రామానికి చెందిన అల్లి సునీత వద్ద 10 లీటర్లు, ఎక్కిల పద్మ వద్ద 15 లీటర్ల గుండుంబా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని తహసీల్దార్ ఎదుట రూ. 50 వేల పూచీకత్తుపై బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా గుడుబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రామప్పలో పర్యాటకుల సందడి

- ■ సందర్శించిన బెంగళూరు ఎమ్మెల్యే మునిరత్నం



శిల్ప కళను తిలకిస్తున్న మునిరత్నం నాయుడు

వెంకటాపూర్, అక్టోబర్ 7 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు.

**సందర్శించిన కర్నాటక మాజీ మంత్రి**

శనివారం కర్నాటక మాజీ మంత్రి, బెంగళూరు ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు తన స్నేహితులతో కలిసి రామప్పను సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ బెంగళూరులో ఒక గుడి నిర్మించేందుకు రామప్ప ఆలయాన్ని ఆర్ట్ డిజైనర్ గుడిపెల్లి గోపి, స్నేహితులతో కలిసి సందర్శించానని తెలిపారు. రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

## సీఆర్పీఎఫ్ పోలీసుల స్వచ్ఛ భారత్

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కల్వర్టుల తనిఖీ..**

మండలంలోని అలుబాక గ్రామ శివారు నుంచి యాకన్నగూడెం వరకు ఎస్సై రేఖా అశోక్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది, బాంబ్ డిస్పోజల్ టీం కల్వర్టులను తనిఖీ చేశారు. అనంతరం వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు.



చీరెలు పంపిణీ చేస్తున్న జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

## బతుకమ్మ చీరెల పంపిణీ

ఏటూరునాగారం, అక్టోబర్ 7 : బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన చీరెలను మహిళలకు అందజేస్తున్నట్లు జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పండుగ రోజున మహిళలు కొత్త చీరెలు ధరించి ఉత్సాహంగా ఉండాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారని, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, రేషన్ డీలర్లు శిరీష, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చేయూతనిస్తున్న ప్రభుత్వం

తాడ్వాయి, అక్టోబర్ 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చేయూతనిస్తున్నదని ఎంపీపీ గొంది వాణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు ప్రభుత్వం అందించిన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దండుగుల మల్లయ్య, తిరుపతి, లింగాచారి, సదానందం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీతో మహిళ మృతి



పద్మ (ఫైల్)

కాటారం, అక్టోబర్ 7 : మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గంగపురికి చెందిన గోనె పద్మ (36) డెంగీ జ్వరంతో మృతి చెందారు. మృతురాలి బంధువులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం కాటారం ఏఎంసీ డైరెక్టర్ గోనె ముకుందం భార్య పద్మకు నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చింది. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నా జ్వరం తగ్గలేదు. దీంతో కుటుంబ సభ్యులు పద్మను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరంగా తేల్చి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురున్నారు.

## 75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- ■ ముగ్గురిపై కేసు నమోదు



పట్టుకున్న బియ్యం, నిందితులతో పోలీసులు, అధికారులు

గోవిందరావుపేట, అక్టోబర్ 7 : అక్రమంగా రవాణా అవుతున్న 75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం పట్టుకోవడంతో పాటు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పస్రా పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ పీ దయాకర్ రావు, పస్రా సీఐ శంకర్, ఎస్సై మస్తాన్ తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వీటిని తరలిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారానికి చెందిన మాలోత్ తిరుపతి, బీద సుధాకర్‌తోపాటు తాడ్వాయి మండలం నార్లాపూర్‌కు చెందిన మొక్క సతీశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా మండలంలోని పస్రా, లింగాల నుంచి కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు చెప్పారని, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.1,12,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.